
గులాబి
ముళ్ళు

**తెలిసో, తెలియకో తప్పు చేయడం జరుగుతుంది. ఒకసారి తప్పు చేసినవారు జీవితాంతమూ చేస్తూనే ఉంటారని భావించడం తప్పు. చేసినది తప్పని తెలుసుకొని, దానిని దిద్దుకొని, బయట పడడానికి ప్రయత్నించి కూడా మార్గంలేక మళ్ళీమళ్ళీ అదే తప్పు చేయవలసిన స్థితి ఎవరికైనా దురదృష్టం.**

**దయానిధి** వీధిలో అడుగుపెట్టేసరికి చిన్నగా తుంపర్లు పడసాగాయి. అసలు ఆ రోజంతా వాన వస్తుందేమోనన్నట్లు, ఉదయంనుంచి మబ్బులు ఆకాశంలో కవాతు చేస్తూనే ఉన్నాయి, యుద్ధానికి ఆయత్తమయ్యే సైనిక పటాలాలలా! కానీ సాయంత్రం దాకా వాన కురవలేదు. మబ్బులు కవాతు మాననూ లేదు.

దయానిధి పగలల్లా ఇంట్లోనే ఉండిపోయాడు. బయట పనేంలేదు. అందుకని ఇంట్లో సామానంతా సర్దుకున్నాడు. ఉన్న సామానూ ఏరేం లేదు. ఓ క్యాంప్ కాటూ, ఓ ట్రంకూ, సూట్‌కేసూ, కొన్ని పుస్తకాలూ, ఉద్యోగానికి సంబంధించిన కొన్ని ఫైళ్ళూనూ. అన్నీ సర్దుకుని కూజాగ్లాసూ, అద్దం వగైరా సామాను యాదగిరికి ఇచ్చేశాడు.

సాయంత్రానికి అన్నీ సర్దటం అయిపోయింది. స్నానంచేసి, ఇస్త్రీ గుడ్డలు కట్టుకున్నాడు. అప్పటికి గాని అతడికి ప్రాణం సుఖాన పడలేదు.

వీధి దీపాలు వెలుగుతున్నా, బజారంతా చీకటిగానే ఉంది. దుకాణాల్లో నించి మాత్రం కేకలు, నవ్వులతో పాటు, ఫ్లూరోసెన్ దీపాల వెలుగూ కొట్టవచ్చినట్లు వినిపిస్తున్నాయి, కనిపిస్తున్నాయి.

రామాలయం మండపంలో ఒక బైరాగి తత్వాలు పాడుతున్నాడు. నడి వీధిలో చుక్కచుక్కల ఆంబోతు ఠీవిగా పడుకుని నెమరువేస్తున్నది. మాదాకవళం అంటూన్న ఓ అన్నార్తుడి ఆక్రోశం గడ్డకట్టిన అంధకారంలోంచి కర్ణ కఠోరంగా వినపడసాగింది.

దయానిధి హోటలులో ఓ మూలగా కూర్చుని సిగరెట్ ముట్టించాడు.

కాఫీ తాగుతూంటే ప్రొప్రయిటర్ నవ్వుతూ వచ్చి, పక్కన కూర్చుని, "రేపే నా ప్రయాణం?" అని అడిగాడు.

"ఊఁ."

"మళ్లీ ఎన్నాళ్లకో రావటం?"

దయానిధి మాట్లాడలేదు.

"వెళ్లేముందు మళ్లీ కనబడతారా?" లేచి వెళ్ల బోతూ ప్రశ్నించాడు ప్రొప్రయిటరు.

"చెప్పలేను! మీకు ఎంత ఇవ్వాలో లెక్కచూడండి. డబ్బు ఇచ్చేస్తాను."

"అలాగే!"

కప్పు అక్కడే ఉంగలుంగలుగా పొగ వదులుతూ కూర్చున్నాడు దయానిధి. రేడియోలో ఎవరో వార్తలు చదువుతున్నారు. దయానిధి విందామనుకున్నా, ఆ వాతావరణంలో సాధ్యపడలేదు.

ఓ మూలగా చేరిన నలుగురు రైతులు పెద్దగా ఏదో విషయాన్ని గురించి నవ్వుకుంటూ, తుళ్లు కుంటూ మాట్లాడుకోసాగారు. సర్వర్లు వింత వింత గొంతులతో కేకలు వేస్తున్నారు. బయట రెండు కుక్కలు హోరాహోరీగా యుద్ధానికి తలపడ్డాయి. హాల్లో మధ్యగా ఉన్న బాలాజీ బొమ్మమీద బల్బులు తపస్సు చేస్తున్నాయి. రంగు రంగు దీపాల వెలుతుర్లో రకరకాల మనుషులు, వింతవింత రూపాల్లో, క్రీనీడల్లా తిరుగుతున్నారు.

దయానిధి హోటలు వాడికి డబ్బు ఇచ్చి, నమస్కారం అందుకుని స్టేషనువేపు బయలుదేరాడు.

వానజల్లు పడసాగింది.

ఊరికీ స్టేషనుకూ ఓ అరమైలు దూరం. పొలాల గట్లమీదుగా వెళ్లవచ్చు వేసవికాలంలో. అదే వానాకాలంలో మరో అరమైలు చుట్టూ తిరిగి, కచ్చా రోడ్డుమీదుగా రావాలి.

దయానిధికి ఆ పొలం గట్లు పరిచితమైనవే. ఈ ఊరు వచ్చిన దగ్గిరనించీ వాటిమీదుగా నిత్యం నడుస్తున్నాడు.

ఊరినుంచి దూరం అవుతున్నకొద్దీ, ఊళ్లో సందడి క్రమక్రమంగా తగ్గసాగింది. కీచురాళ్లు విడి విడిగాను, మూక ఉమ్మడిగాను గొంతులు చించుకుని రొద చెయ్యసాగాయి.

స్టేషనులో పెట్రోమాక్సు లైటు కాంతి కొద్దిగా కనపడసాగింది. ఔటర్ సిగ్నల్స్ కళ్లెర్రచేసుకుని చీకటిని కొట్టవచ్చేలా చూస్తున్నవి!

ఉండి ఉండి ఆకాశం గర్జించి, మెరవసాగింది. ఆ మెరుపుతో ప్రకృతి అంతా ఉలిక్కిపడసాగింది.

వాన పెద్దదయింది. దయానిధి చకచకా అడుగులు వేసుకుంటూ స్టేషనువేపు నడవసాగాడు.

దయానిధి మనస్సులో ఆలోచనలు సుళ్లుగా తిరగసాగాయి!

కామేశ్వరి, ఆఖరికి చావటానికే నిశ్చయించుకుంది! తల్లీ, తండ్రీ, తోడబుట్టినవాళ్లూ, శాయశక్తులా కామేశ్వరిని బ్రతికించాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. కామేశ్వరి జయిస్తుందా? కలలో సమస్య. ఈ రెండేళ్లుగా దయానిధి ఆలోచిస్తున్నాడు. ఆఖరికి ఏమౌతుంది అని.

రేపటితో ఈ ఊరికీ తనకూ సంబంధం తీరిపోతుంది.

రోజూ ఈ పొలాల గట్లమీద రాత్రిళ్లు నడిచే అదృష్టం మరి ఉండదు. రాజమ్మను చూచే అవకాశం అరమైలు దూరంలో ఉండదు. కొన్ని పదుల మైళ్ల దూరం అవుతాడు తను. ఏ వంకతో వచ్చి రాజమ్మను చూచి సంతోషించగలడు తను?

కొత్త ఊళ్లో, కొత్త ముఖాలు చూస్తూ, పరిచయాలు, పలకరింపులు, చేసుకుంటూ, తనూ వాళ్లలో కలిసిపోవాలి.

స్టేషనులో అడుగు పెట్టేసరికి లాల్చీ తడిసిపోయింది. జుత్తులోంచి నీళ్లు కారసాగాయి. చెప్పులకు బురద అంటుకుంది.

కుండపోతగా వాన కురవసాగింది.

దయానిధిని చూచి పోర్టరు నమస్కారం చేశాడు. "వాన వస్తే మీరు రారేమో అనుకున్నాను!" అన్నాడు బోసి నోటితో.

# ఎస్. రామారావు

దయానిధి మాట్లాడలేదు.

"రాజమ్మ మీ కోసం చూస్తున్నది!"

పోర్టరు వెళ్ళినవేపు చూశాడు. తనలో తను నవ్వుకుంటూ వెడుతున్నాడు.

'తను ఈ స్టేషనుకు రోజూ ఈ వేళప్పుడు ఎందుకు వచ్చేదీ అందరికీ తెలుసు. అయినా ఏదో వంకతో పలకరించి, పరాచికమాడి ఎత్తిపొడుస్తూంటారు. వీళ్ల నోళ్లు మూయించాలి. అది నెరవేరని ప్రతిజ్ఞ. ఎందుకని?'

దయానిధి పళ్లు కొరుక్కున్నాడు, కోపంతోటే!

'తను రాజమ్మ మైకంలో పడ్డాడు శ్లేష్మంలో ఈగ లాగ—అని అందరూ అనుకుంటారు? నిజమా? తను...'

కాదని దయానిధి అంతరాత్మ ఎలుగెత్తి చాటుతుంది. ఆ ఆత్మవిశ్వాసం అతనికి కొండంత ధైర్యాన్నీ బలాన్నీ ఇస్తుంది. రోజూ వెడతాడు. వెళ్లకపోతే?... దయానిధికి జ్వరం వస్తుంది. ఒళ్లంతా కొరడాతో కొట్టినట్లు బాధ కలుగుతుంది. ఆ రాత్రి నిద్ర పట్టదు. అన్నం రుచించదు. ఇవన్నీ రాజమ్మను చూడక పోవటం వల్లనే అని నిర్ధారణ చేసుకున్నాడు. ఆ అనిర్ధారణకు చాలా రోజులు ఆలోచించి మరీ వచ్చాడు.

ఆ నిర్ణయానికి వచ్చాక ఎవరేమన్నా దాన్ని గురించి బాధపడలేదు. ఆలోచించనూ లేదు.

మూడవ తరగతి విశ్రాంతి గదిలో ఓ బైరాగి స్తంభాని కానుకుని బీడీ కాలుస్తున్నాడు. ఓ మూల భార్యతో పిల్లలతో ఓ రైతు కూర్చొని ఉన్నాడు. పిల్లలు అన్నం తింటున్నారు. తల్లి అన్నం కలిపి పెడుతున్నది.

దయానిధి రుమాలుతో ముఖంమీది నీళ్లు తుడుచుకుని రాజమ్మ కొట్టు దగ్గిరికి వెళ్లాడు.

రాజమ్మ నల్లగా ఉంటుంది. రాణీమార్కు రూపాయంత కుంకుమ బొట్టు కొట్టవచ్చినట్లు కనిపిస్తూంటుంది. మెళ్లో నల్లపూసలు, బంగారునాను. గుండ్రటి ముఖంలో అరచెయ్యంతటి నీలికళ్లు. గడ్డంమీద మూడు పచ్చబొట్లు. దయానిధి ఆమె వేషం చూస్తూ మరి పరిసరాలే మరిచిపోతాడు. గుండ్రటి మెడ ముద్దు పెట్టుకోవాలని, బలిసిన వక్షోజాలు తాకాలనీ అతనికి విపరీతమైన వాంఛ. అది ఇంతవరకు నెరవేరలేదు. ఇహ తీరుతుందన్న ఆశా లేదు. రేపు తను ఉండడు. ఆమెను చూడడం పడదు.

కొట్టుకు ఇవతలగా చీకట్లో నిలబడి ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. పెట్రోమాక్సు లైటు చుట్టూ దీపం పురుగులు తిరణాలకు వచ్చిన జనంలా ఉన్నాయి.

రాజమ్మ ఏదో ఆలోచనలో ఉండి దయానిధిని గమనించలేదు. చూశాక కొట్టులో కూర్చోలేదు.

"అక్కడే నిలబడ్డారేం?"





# గులాబీ ముళ్లు

"ఊరికేనే."

"చినుకులు మీద పడటం లేదూ?"

"తడిసే వచ్చాను!"

రాజమ్మ మాట్లాడలేదు. చుట్టూ చూసింది. దయానిధిని కూర్చోబెట్టేందుకు జాగా కనబడలేదు. నిస్సహాయంగా చూసింది దయానిధివేపు.

"ఇంకా దుకాణం కట్టెయ్యలేదేం. బళ్లన్నీ వెళ్లిపోయాయనుకుంటాను."

"ఆఁ! మూసేద్దా మనుకునేంతలో వానొచ్చింది. తగ్గుతుందేమోనని చూస్తున్నాను."

"అంతేనా? ... లేక..." దయానిధి ఆమె కళ్లల్లోకి సూటిగా చూశాడు.

రాజమ్మ తల దించుకొని, "అనదలుచుకున్నది అనండి!" అన్నది.

"నే రావటం ఆలస్యమైందని చూస్తున్నావేమోనని. . ."

రాజమ్మ క్షణం మాట్లాడలేదు. "నిజమే! మీరు వస్తారని తెలిసే ఆగిపోయాను."

"నా మీద అంత నమ్మకముందా?"

"లేదని మీ రనుకుంటున్నారా? లేక నాచేత చెప్పించాలనా?"

"ఆహా! అదికాదు!"

"నాకు తెలుసు! మీరు నన్ను నమ్మరు!"

"నీ మీద నమ్మకం లేంది ఈ వానలో ఇలా తడిసి రావలసిన ఖర్మేముంది?"

రాజమ్మ మాట్లాడలేదు. కిళ్లీ కట్టింది. సిగరెట్ పెట్టె తీసి ఇచ్చింది.

దయానిధి జేబులో వాటిని పెట్టుకొని, "నీకు ఎంత ఇవ్వాలి?" అడిగాడు.

రాజమ్మ దయానిధివేపు ఆశ్చర్యంగా చూసింది.

"అదే! ఈ నెల సిగరెట్లు, కిళ్లీల డబ్బు ఇవ్వలేదుగా? తెల్లవారుఝామున ఊరెళ్లి పోతున్నాను!"

"కనక నా ఋణం ఉంచుకో దలచుకోలేదన్న మాట!"

"అదికాదు . . ."

"ఏది కాదు?" నవ్వింది రాజమ్మ. "మళ్లీ మీరు ఈవేపు రానేరారు. వద్దామని మీకుండవచ్చు. కానీ మీ హోదా, భార్య, సంసారం రానివ్వవు!"

"అందుకని?"

"మీరు కిళ్లీ వేసుకున్నప్పుడు, సిగరెట్టు కాల్చినప్పుడు మీకు నేను జ్ఞాపకముండాలి! . . . అది నా కోరిక! మీరు డబ్బులిస్తే నా కోరిక తీర్చటం మీ కిష్టంలేదనే నే అనుకోవాలి!" రాజమ్మ మాట్లాడుతూనే కొట్టు కట్టేసింది పెట్రోమాక్సు లైటు ఆర్పేసింది. బాటరీ లైటు, గొడుగు పుచ్చుకొని, "వెళదామా?" అన్నది.

దయానిధి అనుసరించాడు.

వాన కురుస్తూనే ఉంది. ఆకాశం గర్జిస్తూనే ఉంది. స్టేషనుదాటి బయటికి వచ్చా రిద్దరూ. రాజమ్మ తడుస్తూనే ఉంది. గొడుగు వేసుకోలేదు.

"గొడుగెందుకు తెచ్చినట్లు?"

"వాన వస్తుందేమోనని!"

"మరి తడవటం దేనికి?"

"అంటే వానలో తడవటం నా కిష్టమైనా మీ ఉద్దేశ్యం?"

"మరి?"

"మీరు తడవంగా లేనిది, నేను గొడుగు వేసుకు నేదా?"

"నా కోసం నువ్వు . . . "

"ఏం, ఈ మాత్రం త్యాగం చెయ్యలేనా మీకోసం?"

"నే నెవర్నని?"

"అంటే నేనేం కానా మీకు?"

"అయితే..." దయానిధి ఆమె చేతిలో గొడుగు తీసి విప్పాడు. ఆమె పక్కగా నడవసాగాడు. రాజమ్మ అందు కేమీ అభ్యంతర పెట్టలేదు.

పొలం గట్లన్నీ వానకు తడిసి జారసాగాయి కాళ్లు. దయానిధి జాగ్రత్తగా పడకుండా నడుస్తున్నాడు. రాజమ్మది స్థూలకాయం. కుచ్చెళ్లు పైకెత్తి పట్టు కుని ఓ చేత్తో, మరోచేత్తో బాటరీ లైటు పట్టుకు నడవటంలో ఓ మారు జారి పడబోయింది. దయానిధి చప్పున ఆమె చెయ్యి పట్టుకున్నాడు. రాజమ్మ కృత జ్ఞతగా చూసింది. ఆ చెయ్యి పట్టు విడవలేదు దయా నిధి. కాగా కొంతదూరం పోయాక ఆమె నడుం చుట్టు చెయ్యివేసి దగ్గిరగా లాక్కుని నడవసాగాడు.

ఊళ్లోకి ప్రవేశించేముందు దయానిధి చెయ్యి తీసేసి, "ఊళ్లోకి వచ్చాం!" అని మాత్రం అన్నది.

చిన్న చిన్న గుంటల్లో నీళ్లు చేరుతున్నాయి. డాబా ఇళ్ల గొట్టాల్లోంచి వాన నీరు ధారగా పడసాగింది. వీధులన్నీ దాదాపు నిర్మానుష్యంగానే ఉన్నాయి. కిటికీ ల్లోంచి వెలుతురు వీధిలోకి తొంగిచూడసాగింది.

సరుకు ఎత్తుకు వెడుతున్న లారీ వానలోతడుస్తూ నిరామయంగా ఉంది.

రాజమ్మ తన ఇంటి వీధి మొగదల నిలబడింది, వెడదామన్నట్లు.

"నేనూ అక్కడిదాకా వస్తా పద!"

రాజమ్మ ఏదో చెప్పబోయింది. దయానిధి అదేం గమనించలేదు!

ఊళ్లో వేసిన మట్టిరోడ్డు కూడా ఆ వీధిలో వెయ్యలేదు. రోడ్డుకు ఇరువైపుల పూరిపాకలు చీకట్లో బిక్కుబిక్కుమంటూ, వానలో తడవసాగాయి. ఆ వీధిలో దీపాలు వెలగవు ఎప్పుడూ కాని. ఆ సంగతి పంచ యితీ వాళ్లు పట్టించుకోరు, ఐదేళ్ల కొకసారితప్ప.

మేకలు కొన్ని ఓ చూరుకింద నిలబడి, నెమరు వేస్తున్నాయి. ఓ పాక ముందు ఓ రిక్షా వానలో ఏకాకిగా ఉంది. దయానిధి ఆ వీధికి రావటం అదే మొదటిసారి. గుంట మెరకల్లో నడవటం అతడికేం కొత్తకాదు. అయినా అక్కడ నడవటం అతడికి సుఖంగా లేదు. బురదనీళ్లతో అతడి ధోవతీ తడిసిపోయింది. వేసుకున్న లాల్చీ ఓ భాగం తడిసిపోయింది గొడుగునీళ్లతో.

రాజమ్మ దయానిధిని గమనించి, "ఇక్కడకు మీలాంటి వాళ్లు రాకూడదు!" అన్నది. వాన హోరులో సరిగ్గా వినపడలేదు దయానిధి కా మాటలు.

"ఇంకెంత దూరం?" అన్నాడు విసుగ్గా.

"వచ్చేశాం! అదే..." చూపించింది రాజమ్మ. దయానిధికి మొదట కనపడలేదు. మెరిసినప్పుడు ఆ వెలుతుర్లో ఆమె చూపిన వేపు గల పాక ఆమె నివాసస్థానమని అనుకున్నాడు.

రాజమ్మ తాళం తీసి లోపలికి వెడుతూ, "ఇక్కడ ఉండండి. దీపం వెలిగిస్తాను" అని చీకట్లో కలిసి పోయింది.

దయానిధికి చూరుకింద నిలబడటం బాగాలేదు. అందుకని లోపలికే వెళ్లాడు అలవాటులేక, గుమ్మం నడినెత్తిన తగిలేసరికి తల తిరిగి, కళ్లు క్షణం బైర్లు కమ్మాయి. నీళ్లూ వచ్చాయి.

దీపం వెలిగించి దయానిధికోసం వచ్చిన రాజమ్మకు అతని కళ్లలో నీళ్లే ముందు కనిపించాయి.

"గుమ్మం తగిలిందా?"

"ఊఁ!"

చప్పున నవారు మంచం వాల్చి "కూర్చోండి" అని సెమ్మెమీద దీపంపెట్టి, దయానిధి జుత్తుచూసింది. నడి మాడు మీద కొద్దిగా నెత్తురు కనిపించింది.

"బాగా తగిలింది!"

రాజమ్మ తుండుగుడ్డ తెచ్చి "ఉండండి" అని నెమ్మదిగా తల అద్దసాగింది.

దయానిధి కా అనుభూతి సరికొత్తది. స్త్రీని అంత దగ్గిరగా చూడడం, స్పర్శాసుఖం ఈ విధంగా పొందడం అతనికి ఉద్వేగాన్ని కలిగజేసింది. నరాల్లో నెత్తురు ఉప్పొంగి పరిగెత్తసాగింది. ముఖం అంతా ఎర్రగ కందిపోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో వేడి, బరువు కలిగాయి. రాజమ్మ వంటిచమట, వానకు తడిసిన గుడ్డల వాసన మత్తుగా ఉంది. తల మీద తగిలిన దెబ్బ బాధ మరిచేపోయాడు.

ఆమె తల తుడిచి, దెబ్బ తగిలినచోట పౌడరు అద్దేంతవరకూ దయానిధి కన్నులు తెంపుకోలేని మహోన్నదిలా ఉన్నాడు. తన్ను తాను నిగ్రహించుకోవాలని ప్రయత్నించాడు.

కానీ అతడు ఓడిపోయాడు. ఆ పాకలో చిక్కుపడ్డ గాలి, ఉరుముతూ, మెరుస్తూ హోరున కురిసే వాన, తల తుడిచేటప్పుడు ఊగిసే ఆమె బిగుతైన ఎల్లటి వక్షోజాలు అతన్ని నిలవనియ్యలేదు!

ఎక్కడో పిడుగు పడ్డది గుండెలు గుభేలుమనేలా. ఆ శబ్దానికి రాజమ్మ ఉలిక్కిపడ్డది. అప్పటికే ఆమె దయానిధి బిలిష్ఠమైన బాహుబంధాల్లో బంధింపబడ్డది.

## 2

కప్పలు బృందగానం చేస్తున్నాయి. కీచురాళ్ళు శ్రుతి కలుపుతున్నాయి. ప్రకృతి స్నానం చేసిన స్త్రీలా అందంగా స్వచ్ఛంగా ఉండి తెల్లని వెన్నెల వల్లెవాటు వేసుకుంది.

దయానిధి వరండాలో వాలుకుర్చీలో పడుకున్నాడు. సిగరెట్ పొగ తెల్లటి మేఘంలో కదలసాగింది.

తనేం చేశాడు.

కామేశ్వరికి అన్యాయం చేశాడు!

ఎందుకు?

ఆ రోజు రాత్రి ఆమె మనస్సు మర్మం విడిచి, తాళి కట్టిన భర్తకు, జీవిత భాగస్వామికి ప్రథమ సమాగమం రోజున తన కన్యాత్వంలోని ఒక్కొక్క దోషాన్ని, తప్పిదాన్ని చెప్పినందుకు!

అలా చెప్పటం, ఆమె భర్తనుంచి సానుభూతి, ప్రేమానురాగాలు పొందాలన్న ఆశతోనే.

కాని తనేం చేశాడు?

గతం కళ్ల ముందు మెదిలింది. ఆ జ్ఞాపకాలు మళ్లీ ఇన్నాళ్ల తరవాత జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఈ మధ్యలో రెండేళ్ల వయస్సు పెరిగింది దయానిధికి.

ఇన్నాళ్లుగా తను కామేశ్వరి సుఖం చూడలేదు.

'అదే ఆమెను బాధించిందేమో?' అన్నది దయానిధి మనోమాత్రమే.

దయానిధి కుర్చీలోంచి లేచి, పెట్టె ల్లోపల ఉన్న ఉత్తరం తీశాడు. అందులో అక్షరాలు చెరిసి పోయాయి దాదాపు. కొన్నిరోజుల క్రితం కామేశ్వరి వ్రాసిం దా ఉత్తరం. అనాటి అంతో కనా ఎన్ని వందలసార్లు చదివాడు దాన్ని

లైటు దగ్గరగా కూర్చొని ఉత్తరం చదివాడు. "మిమ్మల్ని ఏమని సంబోధించాలో నాకు తెలియదు! తాళి కట్టినందుకు మీరు నా భర్త, లోకం దృష్టిలో. కాని భార్యగా మీ అనురాగాన్ని, అభిమానాన్ని కేవలం సానుభూతిగా కూడా నోచుకోని నాకు, మీకు తాళి కట్టిన బంధం తప్ప మరేం లేదు. మీ రూపురేఖలు ఊహించుకోటానికి అవకాశం లేనిది నాకు. అది నా దురదృష్టం. అందుకు ఎవరూ బాధపడటం నా కిష్టం లేదు. మీరు మరో వివాహం చేసుకోండి. నా కభ్యంతరం లేదు. అలా మీరు నిర్ణయించుకునే ముందు ఒక్కసారి మీ దర్శనం నా కిప్పించండి. నా కళ్లలోకి సూటిగా చూడండి, చాలు.

అంతే నా కోరిక! మీ చివరి కోరికను తప్పకుండా తీర్చండి! మీ భార్యగా నా కున్న హక్కు అది! రండి! ఎంత త్వరగా మీరు రాగలిగితే అంత త్వరగా నేను మీ కళ్లను నా దర్శనంనుంచి విముక్తి చేస్తాను.

వస్తారు కదూ?

మీ . . . "

దయానిధి వెళ్లలేదు. ఆమె కోరిక తీర్చలేదు.

ఏందుకని?

దయానిధి అంతరాత్మ ఘోష ఇన్నాళ్లకు విన గలుగుతున్నాడు. ఆ ఘోష ఇదేనా. అది "దయానిధీ,



విశ్రాంతి
చిత్రం — గోలి వెంకట ఉద్ధ్రాజ్
(సినా వా-4)

(తరువాయి 37 వ పేజీలో)

# గులాబీ ముళ్లు

( 35 వ పేజి తరువాయి)

నీవు దోషివి" అని అంటూంది.

నిజంగా తను దోషి?

కాదని చెప్పుకోలేడు. అయినా నిర్దోషి అనుకోలేడు. ఈ పరిస్థితి చాలా తమాషాగా, త్రిశంకు స్వర్గంగా ఉంటుంది.

ఇలా అస్తి, నాస్తి అన్న విచికిత్సలోనే రోజులు ఒరిగిపోతున్నాయి. అక్కడ కామేశ్వరి పరిస్థితి విషమించ సాగింది.

కామేశ్వరి నిజంగా మంచిదేమో?. . . కాకపోతే ఏ స్త్రీ నోటితో చెప్పుకోని దోషాన్ని, అందులోనూ భర్తకు చెప్పటం. . . . ఏమో ... తను దోషేనేమో?

కాదు, కాదని అతను గిజగిజలాడేవాడు. కానీ అంత, రాత్మకు మాత్రం సమాధానం చెప్పుకోలేక పోయే వాడు.

దయానిధి, పెట్టెలోంచి మరో ఉత్తరం తీశాడు.

"దయానిధీ,

నీ సలహా కావాలి. చాలా విచిత్రమైన పరిస్థితిలో ఉన్నాను. బాగా ఆలోచించి పరిష్కారమార్గం సూచించు. అలా చెయ్యగలవన్న నమ్మకం నాకుంది.

ఓ అమ్మాయిని ... పేరు అడక్కు... బలవంతాన, మూర్ఖంగానే అనుకో, అనుభవించాను! అప్పటి కా లమ్మాయికి పద్దాలుగేళ్లు. ఇంకా ఈడేరలా అప్పటికి. నేను పశుకామంతో ఆమె కన్యాత్వంలో చిచ్చుపెట్టాను. ఇది జరిగి చాలా రోజులైంది. అప్పట్నించీ నాలో నేను ఆ సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కుమిలిపోతూం టాను. నా కాళ్లమీద నేను నిలబడే స్థితికి వచ్చాక, అక్కడకు వెళ్లాను, వీలయితే నా పాపపరిహారంగా ఆ అమ్మాయిని వివాహం చేసుకుందామని. అప్పటికి ఆ లమ్మాయి వివాహిత! భర్త ఆ అమ్మాయిని వదిలేశాడు. కారణం ఎవ్వరికీ తెలియదు. ఇందులో సందేహం లేదు. కన్నవాళ్లకు, చనువు కలిగినవాళ్లకు, ఆ అమ్మాయి అత్త మామలకు తెలియదు.

కానీ నేను ఊహించాను. ఆ అమ్మాయి జీవితం అలా మోడువారిపోవటానికి నేనూ కారణమే! నేనేం చెయ్యాలిప్పుడు? ఆమె చావుబతుకులమీద ఉంది. నీ సలహా ఎంత త్వరగా అందితే అంత మంచిది.

ఆ అమ్మాయి భర్తకు ఈ విషయం స్వయంగా వెళ్లి చెప్పి, నా కన్నీళ్లతో అతని అనుమానాన్ని తొల గించమంటావా?

ఏం చేయమంటావు?

మిత్రుడు
సత్యమూర్తి."

అతనికి దయానిధి సమాధానం వ్రాయలేదు. ఆ ఉత్తరంలోని అమ్మాయి కామేశ్వరేనా అన్న ఆలోచన అతనికి చిక్కు విడని సమస్య.

ఇన్నాళ్ల తరవాత కామేశ్వరిని ఎలా చూడటం? బంధువులు, మిత్రులు, అందరివాళ్లు, కానివాళ్లకు ఇన్నాళ్లూ తనెందుకు అజ్ఞాతవాసంలో ఉన్నాడో చెప్పటం సాధ్యమా? అన్న సందేహం దయానిధికి ఉన్నది

ఇన్నిటి మధ్య దయానిధిని బదిలీ చేశారు. అది అతనికి ఇష్టంలేదు. అలా అని బదిలీని ఆపుచేయించు కునే ప్రయత్నం చెయ్యలేదు. ఎలా అయితే అలా అవు తుంది అన్న ధీమా మనస్సులో గట్టిపడసాగింది.

దయానిధి తల ఆలోచనలతో వేడెక్కింది ఆ ఉత్తరాలు అక్కడే పడవేసి లేచివెళ్లి, లైటు తీసేసి కుర్చీలో కూలబడి బలవంతాన కళ్లు మూసుకున్నాడు.

ఊహూఁ! నిద్ర రాలేదు.

రాత్రి మైనపువత్తిలా కరిగిపోతున్నది. చల్లటి గాలి మందమందంగా, గర్భిణీస్త్రీ నడకలా వీవసాగింది

తెల్లారాక రెండు వందల మైళ్లు నానా రకాల వాహనాల ప్రయాణంచెయ్యాలి అడంగు చేరేందుకు. నిద్రరాదు. బద్ధకం పెరిగిపోతున్నది. ఒళ్లంతానొప్పులు. నరాలు లాగుతున్నాయి. తల పోటెక్కుతున్నది. కళ్లు మండుతున్నాయి.

ఎందు కిలా అవుతూందో అర్థం కాలేదు దయానిధికి.

దయానిధి బలవంతాన మళ్లీ కళ్లు మూసు కున్నాడు . . . రాజమ్మ!

తుఫానులోంచి తప్పుకున్న గువ్వలా... రాజమ్మ... ముడుచుకుపోయి . . . వణుకుతూ . . . పొర్లుకు వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంటూ . . . మధ్య . . . మధ్య భయంగా . . . దయానిధిని చూస్తూ . . రాజమ్మ . . . జాకెట్ చిరిగి పీలికలైపోయింది! కట్టుకున్న కోక చెల్లాచెదురు కాగా . . . దేహాన్ని దాచుకోవాలని ప్రయత్నిస్తున్న రాజమ్మ...

"నే తప్పు చేశాను!" తల వంచుకునే అన్నాడు దయానిధి.

ఆమె బావురుమని ఏడ్చింది. తన్ను తాను సంబాళించు కుంది.

ఉక్కుమనిషిలాంటి రాజమ్మ . . . ఏడుస్తుంటే, రెక్కలు తెగిన పక్షిలా విలవిల్లాడుతూంటే ... దయానిధికి ఆశ్చర్యం వేసింది.

"క్షమాపణ వేడుకుంటున్నాను!... నువ్విలా ఏడవకు!"

ఆమె ఏడుస్తూనే ఉంది.

"నేను దురుద్దేశంతో ఇక్కడకు రాలేదు. రెండేళ్ల పరిచయంలో నీవు గ్రహించే ఉంటావు,... కానీ ఏం చెయ్యను? నా మనస్సు... నిగ్రహంలేని నా మనస్సు ... దానికి తల ఒగ్గాను ... ఈ ఒక్క తప్పు క్షమించు ..."

ఆమె సూటిగా చూసింది ఒక్కసారి. దయానిధి తల వాలిపోయింది.

"నేను బలహీనుణ్ణి ... కాదనను. ఈ ఒక్క తప్పు క్షమించు! అలా అంటే నా హృదయం తేలిక పడు తుంది. అప్పుడే నేను ప్రశాంతంగా ఈ ఊరు విడిచి వెళ్లగలను. ధైర్యంగా భవిష్యత్తులో బ్రతకగలను..."

రాజమ్మ పెదవి కదపలేదు.

ఇద్దరూ అలా రాతి బొమ్మల మాదిరి కూర్చుండి పోయారు. ఆ ప్రశాంతత భయంకరంగా ఉన్నా, దాని నుంచి తప్పించుకోగల ధైర్యం లేదు దయానిధికి.

కొంతసేపటికి ఆ ప్రశాంతతలో రాజమ్మ మెల్లగా, స్ఫుటంగా ఏదో గొణుక్కో సాగింది. అది తన నుద్దేశించే



మహిషాసురమర్దని (కంచి శిల్పం)
ఫోటో—ఎస్. ఆర్. డి. మూర్తి (మద్రాసు-4)

నని గ్రహించాడు దయానిధి. ఆమె చెప్పేది ఆలకించాడు శ్రద్ధగా.

"నేను పతివ్రతను కాను! ఎందరి దగ్గరో ఉన్నాను. ఎందరో నా దగ్గర ఉన్నారు. అయితే. నీతిలేని దాన్నా అంతమాత్రాన! ప్రతి మొగాడికీ నేను బానిస కాను. నా నియమాలు నా కున్నాయి. ఎంత చెడినదాన్ని అయినా ఒకణ్ణే నమ్ముకునిఉన్నాక మరొకరికి ఎందుకు లొంగాలి? నేను నమ్మినవాడు కాదంటే, ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి అసహ్యం పుట్టి విడిగా ఉంటేనే సుఖంగా ఉంటుందని తోస్తే విడిచిపోతాను. కలిసిఉండి కష్టపడేదానికంటే అదే మేలుకదూ?... మీరు నా దేహాన్ని ఆకలిగా చూడటం నాకు తెలుసు. మీ కళ్లలో కోరికా గ్రహించాను. అయినా గిరి దాటలేదు. చనువు పెంచలేదు. అలా అని మీ మనస్సు నొప్పించలేదు. ఎందుకు? మీరంటే ప్రేమ ఉంది. ఆ ప్రేమపేరిట మీ జీవితం నాశనం చెయ్యటం ఇష్టంలేదు. మీ భార్య ఉసురు నాకు తగలకూడదని. మీ సంసారంలో నా జ్ఞాపకాలు రాకూడదని.

ఇవాళ ఎంతో సుదినమని పొంగిపోయాను. మిమ్మల్ని చెడగొట్టలేదని సంతోషించాను. కానీ ... కానీ . . మీరు ద్రోహం చేశారు. నా అందమైన స్నేహలతను తుంచి నేలమట్టం చేశారు."

రాజమ్మ చెప్పటం ఆపింది! గోడకు ఆనుకుని దృష్టి పడికొప్పుమీదికి నిల్పింది ఓ క్షణం.

"రేపో ఎల్లుండో నా మనిషి వస్తాడు. జైలు

గోడం మధ్య నా జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉడుకుతూ, కేరింతలు కొడుతూ వస్తాడు. కానీ నా ముఖం ఎలా చూపేది? ... ఎలా చూపేది ... ఎలా?... ఎలా?'' ... ఘొల్లున ఏడ్చింది రాజమ్మ!

దయానిధికి దగ్గిరికి వెళ్లి, ఆమె గడ్డం పట్టుకుని ముఖం పైకెత్తి కాటుక కళ్ల నీళ్ళు తుడిచి, సముదాయించి, ఓదార్చాలని ఉంది. కానీ ధైర్యమే లేదు.

దయానిధి ఇంటికి వచ్చినా ఆ ఏడుపు వినిపిస్తూనే ఉన్నది.

దయానిధికి భయం పుట్టి కళ్ళు తెరిచాడు.

తూర్పు కళ్లు తెరిచింది. ఊరు మేలుకొంది. ఎదురింటి పోలీసు నాయుడిగారింటి పాకమీద కోడి తెల్లవారిందేమోనని దిక్కులు చూస్తున్నది.

దయానిధి చప్పున లేచి మొహం కడుక్కున్నాడు. బావిదగ్గిర తలనిండా స్నానం చేశాడు. చకచకా గుడ్డలు వేసుకుని, సామాను సరిచూసుకుని, శాంతా విలాస్‌లో కాఫీ తాగి, ఇంటికి వచ్చేసరికి యాదగిరి సిద్ధంగా ఉన్నాడు.

ట్రంకూ, కాంప్‌కాటూ యాదగిరి తీసుకున్నాడు. మిగతా సామాను దయానిధి తీసుకుని ఇంటివారితో వెళ్లివస్తానని చెప్పాడు.

"మీ కో టెలిగ్రాం వచ్చింది, రాత్రి. మీ కోసం చాలాసేపటిదాకా చూశాం. పొద్దుపోయి వచ్చారనుకుంటాను.''

ఆ టెలిగ్రాం కవరు జేబులో కుక్కుకుని, ఆఘమేఘాలమీద బస్ స్టాండుకు పరిగెత్తుకు వెళ్లాడు దయానిధి.

బస్సు మరో రెండు నిమిషాలకు బయలుదేరుతుందని విని, 'హమ్మయ్య! బతికాను!' అనుకున్నాడు. 'ఈ బస్సు టైముకు వెడితే రైలు ఖాయంగా అందుతుంది. రేపు సూర్యోదయంతోపాటు తనూ ఊళ్లో పడవచ్చు.' అని చెయ్యవలసిన ప్రయాణాన్ని ఊహించుకున్నాడు. ఈ లోపల యాదగిరి ట్రంకూ, కాంప్ కాటూ టాపుమీద వేసి, చేతులు కట్టుకు నిలబడ్డాడు.

జేబులోనుంచి ఓ అయిదు రూపాయలు తీసి, వాడి దోసిట్లో వేసి, క్షణం ఆలోచించి, "అందర్నీ అడిగానని చెప్పు ఆఫీసులో! జీతం మనియార్డరు చెయ్యమని నారాయణకు చెప్పు...మరిచిపోకు... రాజమ్మ కనిపిస్తే...'' అని దయానిధి ఆగాడు ఎవరూ తన మాటలు వినటం లేదుకదా అని.

"రాజమ్మ సచ్చిపోనాది బాబూ, కిరసనాయిలోసుకు, రాత్రి!''

"ఏమిటీ? రాజమ్మ!''

"అవును, బాబూ!''

దయానిధి నిశ్చేష్టుడయ్యాడు. నరాలు బిగుసుకుపోయాయి. కళ్లు చెమ్మగిల్లాయి.

బస్సు బయలుదేరటం గమనించలేదు దయానిధి. ఊరు వెలుపలికి వచ్చాక ఎండ చురుగ్గా తగిలేసరికి దయానిధి బాహ్యస్మృతిలోకి వచ్చాడు! బుగ్గలమీద కారిన కన్నీరు తుడుచుకోటానికి జేబులో చెయ్యి పెట్టాడు. టెలిగ్రాం చేతికి వచ్చింది.

ముఖం తుడుచుకుని టెలిగ్రాంతీసి చదివాడు.

"కామేశ్వరి చనిపోయింది, రాత్రి 12 గంటలకు!''

★


భారతదేశపు సాంప్రదాయకమైన టానిక్



ఝండు

కేసరి జీవన్

అసగా సమృద్ధయిన నవ శక్తిదాయకం:
యువకులకు మరియు వృద్ధులకు సువర్ణము వంటి మేలైనది.

A ZANDU PRODUCT

ఝండు ఫార్మసుటికల్ వర్క్సు లిమిటెడ్, బొంబాయి 28.

TE

రక్తంలోని దోషాలే
చర్మవ్యాధులకు మూలం






చర్మవ్యాధులనుంచి విముక్తికి మీకు సమగ్రమైన చికిత్స అవసరము.

- గ్రంథులను పరిరక్షిస్తూ క్రిములను సంహరించాలి
- లోపల రక్తాన్ని శుభ్రపరిచి, గ్రంథులను పునరుజ్జీవింపజేయాలి

ఈ లక్ష్యంతోనే డాక్టర్ రిచ్‌లెన్ తయారుచేసిన మూడు ప్రక్రియలు ఇప్పుడు ప్రపంచ ఖ్యాతి నొందినవి.

**రిచ్‌లెస్ బ్లడ్ ప్యూరిఫైయర్:** అనేక చర్మవ్యాధులు ఎగ్జిమా, చెమటకాయలు, మొటిమలు, తామర, తెల్లి మున్నగు వాటికి వ్యాధిని తొలగించే మందు. మీ రక్తాన్ని శుభ్రపరిచి, ఆరోగ్య ప్రదం చేస్తుంది.

**గల్లాస్ ఆయిట్‌మెంట్:** ఎగ్జిమా పీడ్లు కారుతూ వున్నపుడు, గాయాలు, పుండ్లు మొదలైన వాటికి శక్తిమంతమైన యాంటి సెప్టిక్.

**రిచ్‌లెన్ లాక్సాటివ్:** మలబద్ధకం నివారించి, ఆహారం అరుగుదలను పెంచి, తద్వారా రక్తాన్ని శుభ్రపరుస్తుంది.

# రిచ్‌లెన్

బ్లడ్ ప్యూరిఫైయర్

కెమిస్టులందరివద్ద, స్టోరులలోను లభ్యం కాగలదు. వివరాలు తెలిపే ఉచిత కరపత్రాన్ని అడిగి తీసికోండి. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లు కావాలి:

ఈ కింది విలాసానికి వ్రాయండి:

ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్లు

మహేశ్వరి జనరల్ స్టోర్స్

19/35, పెద్ద బజారు, కోయంబత్తూరు-1

EP-MG 2 TEL